పుస్తక సమీక్ష :

# 'ఏడుతరాలు'

అలెక్స్‌హేలీ అమెరికా వాస్తవ్యుడు, నల్లజాతికి చెందినవాడు ఆఫ్రికానుండీ బానిసలగా అమెరికా వచ్చిన తన పూర్వీకుల కథను పరిశోధించి, "విజేతలే చరిత్ర విరచించే ఆనవాయితీని బద్దలుకొట్టడానికి" అతను రాసిన పుస్తకం ఇది. ఈ కథ, యాదృచ్ఛికంగా తెల్లవాళ్ల చేజిక్కి బానిసగా మారిన గాంబియా వాస్తవ్యుడు కుంటా కింటేతో మొదలయి, హేలీ వరకు నడుస్తుంది.

అన్యాయానికి పీడనకు గురయినవాళ్ల దృక్పథంలో అనివార్యంగా హేతువాదం, వాస్తవవాదం, భౌతికవాదం, ఎంతోకొంత చోటు చేసుకుంటాయి. భావవాదం, అధ్యాత్మికం, పీడకులకు, ఇటూ చెందక అటూ చెందక తప్పించుకు తిరిగే మధ్యరకపు ధన్యులకూ మాత్రమే సహజం. ఈ కారణం చేత నల్లవాడయిన హేలీ తన జాతికి జరిగిన అన్యాయాన్ని శ్వేతజాతి మానసిక రుగ్మతగానో, అస్తిత్వవాదం ఫక్కీలో మానవాళికి సాధారణమయిన సందిగ్ధతగానో ('human predicament') కాకుండ చారిత్రికంగా చూస్తాడు. అయితే మౌలికమయిన శ్రమదోపిడీ జాతిపీడనగా రూపాంతరం చెందినప్పుడు సహజంగా ఉత్పన్నమయ్యే తప్పుడు చైతన్యం ప్రభావం వదిలించుకోనంత వరకు ఈ వాస్తవవాద దృక్పథం శాస్త్రీయత సంతరించుకోదు. హేలీతో అదేచిక్కు. ఆఫ్రికన్ల గురించి తెల్లవాళ్లు చేసిన దుష్ప్రచారాన్ని వ్యతిరేకించే తపనతో తన ఆఫ్రికా పూర్వీకుల సమాజాన్ని, సాంకేతికంగా ఎంత వెనుకబడ్డదయినా, సామాజిక మానవ సంబంధాల వరకు చాల వున్నత మయినదని చూపించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది చెప్పుకోవలసిన విషయమేగాని, మనకు మధ్యయుగపు ఆఫ్రికా సమాజం గురించి తెలిసిన విషయాల దృష్ట్యాచూస్తే పూర్తిగా అతిశయోక్తి గూడకాదు. ఆఫ్రికాలో భూస్వామ్య విధానం అంతగా విస్తరించలేదు. దోపిడీవర్గం పల్లెప్రాంతాల భూస్వామ్యవర్గంగాకుండ, రాజాస్థానాన్ని ఆశ్రయించి శిస్తుల ద్వారా అదనపు వుత్పత్తిని చేజిక్కించుకొనే వర్గంగావుండేది. పనిముట్లలో స్వంతఆస్తివున్నా, భూమిమాత్రం అధికంగా గ్రామసభల అధీనంలో వుండేది ఆ సభలు రైతులకు 'పట్టా' లిచ్చేవి. గ్రామీణ ప్రాంతాలలో ఈ సభాధికారులు, మతాధికారులు, తెగ పెద్దలు, ఇతర పెత్తందార్లు పాలకవర్గ ప్రతినిధులుగా వుండేవారు. (ఇలాగంటే భూస్వామ్యం, బానిస అర్ధబానిస సంబంధాలు, పెత్తందార్లకు వెట్టిచాకిరి చేసేపద్ధతి, లేనేలేవనికాదు. ఇక్కడ ప్రధానమయిన దోపిడీ సంబంధాల గురించి చెప్పుకుంటున్నాం)

అమీన్ 'శిస్తుదారీ ఉత్పత్తి విధానం' (tribute - paying mode of production) అంటాడు.

ఇటువంటి సమాజంలో హేలీ చెప్పేటంతటి సామూహికత, సమానత లేక పోవచ్చుగానీ, శ్రమజీవికి యూరప్ భూస్వామ్య సమాజంలోని ప్రత్యక్ష అర్థబానిస సంబంధాలలోను, మనదేశ వర్ణవ్యవస్థలోని పరోక్ష అర్థబానిసత్వంలోను, లేనటువంటి స్వతంత్రత, గౌరవం, లభిస్తాయి. అటువంటి సామాజిక సంబంధాలమధ్య పెరిగిన వాడు కుంటాకింటే. దానికి తగ్గట్టే అతడు స్వతంత్రుడు, అభిమాని, దాస్యాన్ని అసహ్యించుకునేవాడు.

నల్లబానిసలకథ అర్థంచేసుకోవాలంటే ఆ బానిస విధానానికి ప్రోద్బలం యేమిటో చూడాలి. యూరప్‌నుండి వలసవచ్చి విశాలమయిన అమెరికాఖండపు మైదానాలనుండి అక్కడి వాస్తవ్యులయిన 'ఎర్రఇండియన్ల'ను హతమార్చి, తరిమివేసిన తరువాత తెల్లవాళ్లకు ఆక్రమించుకున్న భూములను సాగుచేయడానికి, ముఖ్యంగా అధిక శ్రమశక్తి కావలసిన పత్తిపంట పండించడానికి, అదనంగా శ్రామికుల అవసరం వచ్చింది. ఆ అవసరం ఆఫ్రికన్ల దిగుమతి తీర్చింది. దిగుమతిఅయిన ఆఫ్రికన్లు స్వతంత్ర శ్రామికులుగాగాక బానిసలుగారావడం చవుకగా పత్తిపండించడానికి, వస్త్ర ఉత్పత్తి సాంకేతికంగా అభివృద్ధి చెందిన తరువాత బ్రిటన్‌కుచేసే పత్తిఎగుమతి మీద గుత్తాధిపత్యం సంపాదించడానికి, తోడ్పడింది.

ఈ చారిత్రిక శక్తులు కుంటాకింటేను బానిసగామార్చి గాంబియానుండి అమెరికా తీసుకపోతాయి. అమానుషమయిన ఈ సరఫరాకు వ్యతిరేకంగా ఓడలోనే కుంటా, అతని తోటిబానిసలు, తిరగబడడానికి ప్రయత్నంచేస్తారు. కాని సంకెళ్లను, తెల్లవాళ్ల తుపాకీలను ఓడించలేకపోతారు.

అమెరికాచేరిన కుంటాకు చాల ఆశ్చర్యకరమయిన విషయం కనబడుతుంది. అక్కడ తనవంటి నల్లవాళ్లను చాలమందిని చూస్తాడు. అయితే వాళ్లు తప్పించుకు పోవడానికి ప్రయత్నంచేయడం, తనవంటివారికి ఆ ప్రయత్నంలో సాయంచేయడం అటుంచి, తమ యజమాన్లకు గులాంలుగా వ్యవహరిస్తూ, కుంటావంటి ఆఫ్రికన్లను తెల్లవాళ్లలాగే హేళనచేస్తూవుంటారు. దాస్యం కేవలం భౌతికహింసమీదే నడవదని, అంతకంటె బలవంతమయిన భావజాలాన్ని ఉత్పత్తిచేసుకుంటుందని కుంటా గ్రహించడానికి చాలాకాలం పడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే నల్లవాళ్లు తక్కువరకం మనుషలని, బానిసత్వం వారికి ప్రకృతిసహజం అని, చెబుతుంది ఈ భావజాలం.

అయితే ఇదంతా శ్వేతజాతి శ్వేతత్వంనుండి పుట్టిన అహంకారంగా అనుకోకూడదు- నలుపు తెలుపులమధ్య ఘర్షణగా చూడకూడదు- విజాతీయులను శ్రమదోపిడీకి గురిచేయాలంటే మొదట వారిని సాంస్కృతికంగా అణచాలి- వారి ఆచారాలు అనాగరికమయినవని, వారిమతం 'సాతాను' (SATAN) మతమని వారిభాష భాషకాదని వారిచేతనే ఒప్పించాలి- అలాచేస్తేనే దోపిడీ సంబంధాలకు వాళ్ళులొంగుతారు- అందుకే నల్లవాళ్ళు తమ ఆచారాలు పాటించడం, తమ భాష మాట్లాడుకోవడం, పాటలు పాడుకోవడం, ఇదంతా నిషిద్ధం- ఈ "ఆఫ్రికాచెత్త" వదిలిపెట్టమని కుంటాకు యిద్దరు నల్లవాళ్ళే చెబుతారు, తెల్లవాళ్ళుకాదు- కుంటా ముస్లిం మతస్థుడు కాని అమెరికాలోని నల్లబానిసలంతా క్రిస్టియన్లు- రోమన్ సామ్రాజ్యంలో బానిసలకు ఇహలోకవిముక్తికి మారుగా పరలోకములో ముక్తిని సాధించడానికి ఒక ఉపశమనంగా ముందుకొచ్చిన క్రిస్టియన్‌మతం ఈ బానిస సంబంధాలను పదిలం చేయడానికి చక్కగా సరిపోయింది- ఈ కథలోనే ఒక నల్లబానిస "మనం ఎన్నిప్రార్థనలుచేసినా ఈ తెల్లవాళ్ళ గుండెలు కరుగుతయా ?" అనడిగితే మతంమీరిన మరొకబానిస "బైబిల్లో ఏంరాసుందో తెలుసా? జోసఫ్ ఈజిప్టువాళ్ళకి బానిసగా అమ్ముడయ్యాడు. కాని భగవంతుడు జోసఫ్‌యందు మాత్రమే ఉన్నాడు" అని సమాధానం యిస్తుంది.

అయితే కుంటామాత్రం లొంగడు. మొదటితరంవాడు కావడంచేత తన "ఆఫ్రికాచెత్త" వదిలిపెట్టడు- తన చుట్టూవున్న నల్లవాళ్ళను నిరసిస్తాడు- వాళ్ళు క్రిస్మస్‌రోజున యజమానికి కానుకలర్పిస్తున్న దృశ్యంచూసి సహించలేక "ఛీ-చచ్చిపోతే బావుణ్ణు" అనుకుంటాడు- రెండుమూడుసార్లు తప్పించుకోవడానికి ప్రయత్నించి చివరి ప్రయత్నంలో ఒకపాదం సగానికి నరకబడ్డ తరువాతే ఆ ప్రయత్నం విరమించుకుంటాడు- చేలలో పనిచేస్తున్నవాడికి యజమాని బగ్గీతోలే డ్రైవర్‌గా ప్రమోషన్ వచ్చినప్పుడు బానిసవాడలోని మిగిలిన బానిసలంతా అభినందిస్తారు గాని తానుమాత్రం అదొక గొప్ప విషయం అనుకోడు- "తెల్లవాడికోసం తెల్లవాడు చేయమన్న చాకిరీ చెయ్యడంలో అతనికి ఏఘనతా అవుపించలేదు" తనకుమార్తెకు ఆఫ్రికా పేరేపెడతాడు. ఆఫ్రికాలోని ఒకప్పటి మాలీ సామ్రాజ్యకాలంలోని తన పూర్వీకుల గురించి తన కుమార్తెకు చెబుతాడు. బానిసవాడల్లో పుట్టిపెరిగిన తనభార్య భయపడ్డా వినకుండ తన కుమార్తెకు తన మాతృభాష అయిన మాండింకాభాష కొంచెం నేర్పిస్తాడు- ఆ అమ్మాయి చిన్నయజమానురాలికి ప్రియమయిన చెలికత్తెగా మారిందని తనభార్యలాగా సంతోషించడు- తనకూతురు "యజమానురాలి ఒళ్ళోకూర్చోబెట్టుకుని ఆడుకునే కుక్కపిల్ల" మాత్రమేనని అసహ్యించు కుంటాడు.

నిజంగా కుంటాది చాల ఆకర్షణీయమయిన వ్యక్తిత్వం. అయితే అందులో ఆకర్షణ వుందేగాని అది చారిత్రికంగా నిరర్థకం. వర్తమానంలో వేళ్లూనని స్వేచ్ఛాకాంక్ష, వర్తమానాన్ని అసహ్యించుకునే స్వేచ్ఛాకాంక్ష, అందులో నిక్షిప్తమయిన భవిష్యత్తును గుర్తించదు కాబట్టి అది సాధించేది ఏమీవుండదు. గతం తాలూకు స్మృతులలో పుట్టి గతంమీద చూపులు నిలిపిన స్వేచ్ఛాపిపాస ఆ గతాన్ని మరచిపోయి వర్తమానంలో జీవిస్తూ, వర్తమానంలోని వైరుధ్యాలకు స్పందించి, భవిష్యత్తు మీద దృష్టి నిలిపినప్పుడే చారిత్రికంగా అర్థవంతమవుతుంది. అయితే ఈ మార్పు గతితార్కికంగానే రావాలి. బానిసలయిన ఆఫ్రికన్లు గతం తాలూకు ఆలోచనకు స్వస్తిచెప్పాలంటే ఆ జ్ఞాపకాలలోనే పుట్టిన స్వేచ్ఛాకాంక్షను గూడ వదిలిపెట్టి పూర్తిగా బానిస వ్యవస్థలో భాగం కావాలి. స్వతంత్రిత ఈ విధంగా తద్విరుద్ధమయిన బానిసత్వంగా మారి ఆ బానిస సంబంధాలలోని వైరుధ్యాల్ని పురస్కరించుకొని మళ్లీ స్వతంత్రితగా— అయితే ఈసారి పైస్థాయిలో— రూపొందాలి.

కాని ఈ మార్పు కుంటాలో రావడం అసాధ్యం. తరువాతి తరాలలోనే అది సాధ్యమవుతుంది. అందుకనే ఈ మార్పు మొదలి పెట్టుదగ్గరే ఈ కథకు కుంటా అవసరం తీరిపోతుంది. తన కుమార్తె కిజ్జీ ఒక బానిసకు పారిపోవడానికి సాయం చేసిందన్న నెపంతో చాల "మంచి" వాడయిన తమ యజమాని దోపిడీ సంబంధాల మధ్య "మంచి" తనానికి పరిమితులేమిటో స్పష్టంగా చూపిస్తూ అమ్మివేసిన రోజున కుంటా తాను మిగుల్చుకున్న ఆఖరి ఆఫ్రికా ఆచారానికి స్వస్తిచెబుతాడు. దానితో రంగం నుండి కుంటా తప్పుకుంటాడు.

కిజ్జీలోనే గతంనుండి వర్తమానానికి జరిగిన మార్పు మనకు కొంతవరకు కనిపిస్తుంది. కిజ్జీపేరు ఆఫ్రికా పేరు. మతం క్రిస్టియన్ మతం. తండ్రి తన పూర్వీకుల గురించి చెప్పిన కథలు వింటుంది, గుర్తుంచుకుంటుంది, తరువాతి తరాలకు చెబుతుంది. కాని చిన్న యజమానురాలు తన్ను చెలికత్తెగా స్వీకరిస్తే తండ్రిలాగ కాకుండ తాను సంతోషిస్తుంది. ఆమె తనను కష్టాలలో ఆదుకుంటుందని గూడ నమ్ముతుంది. తన కుమారుడు జార్జి తన కోడలికి తమ పూర్వీకుల కథలు చెప్పలేదని బాధపడుతుంది. మనవళ్లకి మాండింకా భాషలో కొన్ని పదాలయినా నేర్పాలని ఆశిస్తుంది, కాని లేక లేక తనకు మనవరాలు పుట్టిన రోజున కృతజ్ఞతలు జీసస్‌కే చెప్పుకుంటుంది— అల్లాకుకాదు.

స్వతంత్రిత నుండి బానిసత్వానికి పరిపూర్ణమయిన పరిణామం మూడవ తరం వాడయిన జార్జిలో కనిపిస్తుంది. అది అతని పుట్టుకలోనేవుంది. బానిసల శ్రమశక్తే

కాకుండ, స్త్రీ బానిసల శరీరం గూడ యజమాన్ల ఆస్తి అయిన వ్యవస్థకు చిహ్నంగా కిజ్జీ యజమానికి కిజ్జీకి పుట్టిన 'సంకరజాతి' వాడు జార్జి. చిన్నతనం నుండి జార్జికి యజమానిని మెప్పించాలనే తపనజాస్తి, అయిదేళ్ల వయస్సులో యజమాని సమక్షంలో మిగిలిన బానిసలకు బానిస తత్వోపదేశం చేసి యజమాని మన్ననలు అందుకుంటాడు. యజమాని దయజూస్తే తన తాతయ్యలాగ చీదరించుకోకుండ వుప్పొంగిపోతాడు. కోళ్లపందేలంటే యజమానికున్న పిచ్చిని పురస్కరించుకొని, కోళ్ల తర్ఫీదులో నైపుణ్యం సంపాదించి యజమానికి చేరువవుతాడు.

అయితే బానిసత్వానికి పరిణామంచెందడం అంటే పూర్తిగా బానిసభావాలు కలిగిఉండడం అనికాదు- అలా అనుకోవడం యాంత్రికంగా ఆలోచించడంఅవుతుంది- గతితార్కికంగా చూస్తే ప్రతివిషయంలోను దాన్ని నిరోధించి అధిగమించే అంశం దానిగర్భంలోనే వుంటుంది. బానిసత్వంలోనే బానిసత్వంపట్ల నిరసన, యజమాని అంటే ద్వేషం, స్వేచ్ఛాకాంక్ష వుంటాయి- అయితే ఆ బానిస సంబంధాల వాస్తవ స్వరూపం నుండి పుట్టినవే గాని మాలీ సామ్రాజ్యంలోని తన పూర్వీకుల ఘనతతాలూకు జ్ఞాపకాలనుండికాదు- జార్జిలోనూ ఈ నిరసన, ద్వేషం,ఆకాంక్ష వున్నాయి.

అయితే ఇక్కడే జార్జికీ అతని తాతఅయిన కుంటాకు చాలతేడావుంది- ఇక్కడే హేలీ తనబూర్జువా దృక్పథాన్ని, సంస్కరణ వాదతత్వాన్ని స్పష్టంగా చూపిస్తాడు. జార్జికి వర్గదృక్పథం లేకపోవడం అర్థంచేసుకోవచ్చు- కాని అతనికి కనీసం జాతి దృక్పథంకూడలేదు. తనయజమానిని మెప్పించి కోళ్ళపందేంలలో నాలుగు రాళ్లు కూడ బెట్టి తన స్వాతంత్ర్యం తన భార్యాబిడ్డల స్వాతంత్ర్యం కొనుక్కుందామన్న ధ్యాసే తప్ప 'కోళ్ళజార్జి'కి వేరే ఆలోచనలేదు. ఇంతకంటె మెరుగైన చైతన్యం అతనికి అలవడ్డానికి అవకాశం లేదనలేం, నిజానికి అమెరికా బానిస సమాజం చరిత్ర మొదటి నుండి గూడ బానిసల తిరుగుబాట్లు జరుగుతూనే వచ్చాయి. అందులో ఒక తిరుగుబాటుకు నాయకుడయిన ఫ్రెడరిక్ డగ్లస్‌ను గురించిన వార్త జార్జి కొడుకు టామ్ స్వయంగా బానిసవాడకు తెస్తాడు. అయితే తెల్లవాళ్ళతో "మీ ప్రార్థనలు, మీ బైబిల్ ప్రవచనాలు, మీ కృతజ్ఞతార్పణం, మీ మతవిన్యాసాలు- అంతా మోసం, దగా, నటన, కుళ్లు" అని చెప్పిన డగ్లస్ ప్రభావం జార్జిమీదగాని, నాలుగవ తరంవాడయిన టామ్ మీదగాని వున్నట్లు కనబడదు. జార్జి తన కోళ్ళపందేల ద్వారా, టామ్ తన కమ్మరి పనిద్వారా డబ్బు కూడబెట్టి తమ కుటుంబం స్వేచ్ఛ కొనుక్కుందామని మాత్రమే పథకం వేసుకుంటారు.

కాని జార్జి యింతగా ప్రయాస పడవలసిన అవసరం లేదు. ఏ చారిత్రిక శక్తులయితే కుంటాను బానిసగా మార్చాయో, ఆ శక్తులే యిప్పుడు అతని మనవడిని విముక్తుడ్ని చేయడానికి ఉద్యుక్తమయ్యాయి. గతశతాబ్దం మధ్య భాగానికి బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం ఒక స్థాయికి చేరుకుంది. అమెరికాలోను అది బలంపుంజు కొనుంది. కోళ్లపందేల కోసం ఊరూరా తిరుగుతూ ప్రపంచపు వార్తలు బానిస వాడకు మోసుకొచ్చే జార్జి ఈ విషయాన్ని గమనిస్తాడు. చార్ల్‌స్టన్ పట్టణం నుండి తిరిగివచ్చి, అక్కడ నల్లవాళ్లు "కాలువలు తవ్వుతున్నారు, రోడ్లువేస్తున్నారు, కంకర పోస్తున్నారు, రైలుమార్గాలువేస్తున్నారు, తమ కండలు కరిగించి దేశాన్ని గొప్పగా చేస్తున్నారు" అంటాడు. ఈ పరిణామానికి స్వతంత్రులయిన శ్రామికులు అధికంగా కావాలి- భూస్వాముల బానిసలయిన నల్లవాళ్ల శ్రమశక్తిని విముక్తిచేయాలి. అయితే పెట్టుబడిదార్లు అధికంగా ఉత్తరరాష్ట్రాలవారు, బానిస యజమానులయిన భూస్వాములు దక్షిణరాష్ట్రాలవారు కావడంచేత, యిది ఉత్తరదక్షిణ రాష్ట్రాలమధ్య అంతర్యుద్ధంగా పరిణమించింది- కాని వర్గసమాజాలు తమ అవసరాల్నిగూడ తిన్నగా గ్రహించవు, డొంకతిరుగుడుగానే గుర్తిస్తాయి- కాబట్టి మార్క్స్ చెప్పినట్లు ఈ అమెరికా అంతర్యుద్ధం "స్వతంత్ర శ్రామిక విధానానికి బానిస విధానానికి మధ్యతగవే అయినా ఇది వాస్తవంలో ముందుకొచ్చింది వేరేరూపంలో, దక్షిణాదిరాష్ట్రాల భూస్వాములు తాము ఉత్తరాది పెట్టుబడిదార్ల మిల్లులకోసం, విదేశీ మారకంకోసం పత్తి పండించిపెట్టే వలససంబంధాన్ని నిరసించి, 'మితిమీరిపోయి', రాజ్యాధికారంలో భాగంకావాలని ముందుకు రావడానికి కోపగించుకొని వారికి 'గుణపాఠం' నేర్పించడంకోసం ఆ ఉత్తరాది పెట్టుబడిదార్లు తమ ప్రతినిధి అయిన అబ్రహాంలింకన్‌ద్వారా బానిసల్ని విముక్తిచేసారు- (ఇలాగనడం లింకన్‌మీద బురదజల్లడంకాదు- చరిత్రలో ఔన్నత్యమయినా సంకుచితత్వమయినా ఏదోఒక చారిత్రికశక్తికి ప్రాతినిధ్యం వహించేవి మాత్రమేనని చెప్పడం).

అయితే ఈవిధంగా విముక్తులయిన బానిసలు వెనువెంటనే పారిశ్రామిక ఆర్థిక రంగంలోకి ప్రవేశించలేదు. నిజానికి ఆమార్పు ఈశతాబ్దం మొదటిభాగంవరకు గణనీయంగా జరగలేదు. అంతవరకు ఒకప్పటి బానిసలు తమ ఒకప్పటి యజమాన్ల భూముల్లోనే కూలీలుగా, కౌలురైతులుగా, పాలేర్లుగా మారారు. కొంతమంది గ్రామీణ ప్రాంతాలలోనే చిన్న ఉత్పత్తిదార్లుగా స్థిరపడ్డారు. జార్జి కుటుంబానికీ యిదే జరుగుతుంది. కొంతడబ్బు కూడబెట్టుకున్నాడు కాబట్టి భూమికొనుక్కుంటాడు- స్వతంత్రుడయిన రైతుగా మారతాడు. కొడుకు టామ్ తనకమ్మరివృత్తిని కొనసాగిస్తాడు.

క్రమంగా, ఈశతాబ్దం మొదటిభాగంనుండి నల్లవాళ్లు పట్టణప్రాంత పారిశ్రామిక రంగంలోకి కార్మికులుగాను 'వైట్‌కాలర్' శ్రామికులుగాను ప్రవేశించారు. 1910లో నల్లజాతి జనాభాలో 75 శాతం గ్రామీణులుకాగా, 1970 నాటికి అది 25కు దిగింది– ఈ క్రమంలోనే టామ్ మనవరాలు ఉపాధ్యాయిని అవుతుంది, ఆమెకొడుకు అలెక్స్‌హేలీ రచయిత అవుతాడు.

నిజానికి ఇది ఏడుతరాలకథకాదు, నాలుగుతరాలకథే– బానిసగావచ్చి బానిసత్వాన్ని నిరసించినతరం, బానిసత్వానికి లొంగుబాటును నాందిపలికినతరం, బానిసత్వానికి పూర్తిగాలొంగి ఆ బానిసత్వంనుండే స్వేచ్ఛను కాంక్షించి విముక్తి సాధించిన తరం, తరువాత క్రమంగా అమెరికా ఆర్థికవ్యవస్థక్రింది సాటగు సంపూర్ణంగా– పల్లెలనుండి పట్టణాలదాక– వ్యాపించిన 'తరం' ఇక జరగబోయేకథ వూహించడానికి హేలీ దృక్పథం చాలదుగాని, ఈ నాలుగుతరాలకథ మాత్రం తన పూర్వీకుల కథలో చక్కగా చూపించాడు. వర్గసమాజం, పీడన, అన్యాయం ఉన్నంతకాలం ఈకథ ప్రపంచ సాహిత్యంలో తనస్థానాన్ని నిలుపుకుంటుంది. ఆ స్థానమేమిటో తెలుసుకునే అవకాశం ఈ అనువాదంద్వారా తెలుగు ప్రజలకిచ్చినందుకు 'సహవాసి'ని హైదరాబాద్ బుక్‌ట్రస్ట్‌ని అభినందించాలి.

సంక్షిప్తీకరణ చివర మరీటూకీగా సాగింది– ఇది కొంతవరకు కథలోనిలోపమే (పైనచెప్పినట్లు ఇదినిజంగా నాలుగుతరాలకథే), అయినా మరొక ముప్పై పేజీలు పెంచివుంటే (ధర రెండురూపాయలు పెరిగినా) బావుండేది. 47వ అధ్యాయం మొదటిపంక్తిలో సంవత్సరం 1855కు బదులు 1885 అని పడింది– ఈ రెండు సంవత్సరాలమధ్య బానిసవిముక్తి జరిగింది కాబట్టి ఈ అచ్చుపొరపాటు పాఠకుడిని తికమకపెట్టే అవకాశంవుంది.

— కె. బి.

ఏడుతరాలు – ఎలెక్స్‌హేలీ అను : సహవాసి, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ, నవంబర్ 1980, పేజీలు 248 + VIII, వెల రు. 10–00, ప్రతులకు హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 3–6–694, హిమాయత్ నగర్, హైదరాబాద్ 500 029.

**ఈ సంచిక 5వ పేజి :**

రగులుకొనే రాకసి బొగ్గు "[illegible]" చేసినవారు